ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

ఆదివారం 2 జూన్ 2024

ఘనంగా హనుమాన్ జయంతి 6

6 నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఉద్యమ జ్ఞాపకాల్లో పోరుగడ్డ



నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- తెలంగాణ ఉద్యమంలో మరుపురాని స్మృతులెన్నో
- జిల్లాలో 22 మంది బలిదానాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాకారమైన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ స్మృతులతో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రయాణం సాగిస్తోంది. తెలంగాణ ఉద్యమంతోపాటు జిల్లా ఏర్పాటులోనూ ప్రజలు పోరాట పటిమను చూపారు. సాధించుకున్న జిల్లా అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగానే నిలిచింది. సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. సాగు, తాగు నీటి కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ఊరట లభించింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో గుండెకాయగా నిలిచిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా జలహారతి పేరిట ప్రారంభించారు. కొండపోచమ్మ సాగర్ వరకు గోదావరి జలాలు పరుగులు తీసింది. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన అవాంతరాలతో మిడ్ మానేరు ప్రాజెక్ట్ జలకళను కోల్పోయింది. మల్కపేట రిజర్వాయర్ ట్రయల్‌రన్‌లోనే నిలిచిపోయింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉద్యమ జ్ఞాపకాలను జిల్లా ప్రజలు నెమరువేసుకుంటున్నారు.

పిడికిలి బిగించిన సిరిసిల్ల పల్లెలు

దొరల గడీల మధ్య అణచబడిన మట్టి ఆత్మఘోష, తెలంగాణ రైతాంగ పోరాటాల మధ్య చైతన్యవంతమైన సిరిసిల్ల పల్లెలు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం గొంతెత్తి పిడికిలి బిగించాయి. సిరిసిల్ల జనం తెలంగాణ మహోద్యమంలో తమదైన పాత్రను పోషించారు. సకల జనుల సమ్మె, ధూంధాంలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర స్మృతులతో పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడమే కాకుండా కొత్త జిల్లాగా రాజన్న సిరిసిల్ల ఆవిర్భావం, కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీలతో అభివృద్ధిలో ముందడుగు వేసింది. జిల్లాలో ఉద్యోగులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు సకల జనుల సమ్మెలో వంద రోజులకుపైగా రిలే దీక్షలను కొనసాగించారు. ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో ముందు వరుసలో నిలిచారు. జాయింట్ యాక్షన్ కమిటీలు, ఉద్యోగుల సంఘాలు ఉద్యమ జోరును పెంచాయి. తెలంగాణ ఉద్యమం కోసం పలువురు ఇంటర్మీడియెట్ విద్యార్థులు, కుల వృత్తులు చేసుకునేవారు, రైతులు ఆత్మ బలిదానం చేశారు. ఉమ్మడి జిల్లాలో 162 మంది అమరులు ఉండగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22 మంది ఉన్నారు.

ప్రధాన సంఘటనలు

తెలంగాణ ఉద్యమ సారధి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో టీఆర్ఎస్‌కు ఊపిరి పోశారు. అదే సంవత్సరం మే 14న కరీంనగర్‌లో సింహగర్జన పేరుతో తొలి బహిరంగ సభను నిర్వహించారు. అందు లో సిరిసిల్ల ప్రజలు కేంద్ర బిందువుగా మారారు. కేసీఆర్ 2009 నవంబరు 8న దీక్షకు ముందు ఢిల్లీలో అన్ని పార్టీల మద్దతును పొందడానికి వెళ్లే సమయంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల మానేరు వాగుపైనే తన పూజ దుస్తులను మార్చుకొని నేరుగా ఢిల్లీకి వెళ్లారు. సిరిసిల్ల గడ్డపై సీమాంధ్రుల నేతలను అడుగు పెట్టనివ్వకుండా తరిమి కొట్టిన సందర్భం మరిచిపోనిది. 2012లో వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షురాలు విజయలక్ష్మి సిరిసిల్ల నేత కార్మికులను పరామర్శించే పేరుతో వచ్చిన ఆ క్షణాల్లో సిరిసిల్ల రణరంగంగా మారింది. తెలంగాణ వాదులు భారీ పోలీసు బందోబస్తును చేదించి ఆమెను అడ్డుకోగా సభను జరిపామనుకుంటూ వెళ్లిపోయారు. సిరిసిల్ల న్యాయవాదులు కోర్టుపైన నల్ల జెండాలు ఎగురవేశారు. ఢిల్లీలో సైతం న్యాయవాదులు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. సకల జనుల సమ్మెలో భాగంగా తెలంగాణ ఉద్యమ కారులు ఆర్టీసీ బస్సును దగ్ధం చేశారు. 2012 సెప్టెంబరు 13 నుంచి మొదలై అక్టోబరు 25వరకు జరిగిన సకల జనుల సమ్మెలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, జర్నలిస్టులు, డాక్టర్లు, లాయర్లు, మహిళలు, యువకులు, అన్ని కుల సంఘాలు ర్యాలీలు, ధర్నాలతో ఉద్యమంలో ముందున్నారు. 2011లో జనచైతన్య యాత్రతో సిరిసిల్లకు వచ్చిన బీజేపీ అగ్రనేత అద్వాణీ ఎదుట తెలంగాణ నినాదాలను హోరెత్తించారు. దీంతో ఆయన తెలంగాణ ఆకాంక్షను గుర్తించానని ప్రకటించారు. రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 100 రోజుల పాటు సాగిపోయాయి. ప్రతీ రోజు వివిధ కుల సంఘాల ర్యాలీలు, బతుకమ్మ ఆటలు, బోనాల పండుగలు, వంటావార్పులతో తెలంగాణ ఉద్యమ ఉధృతిని చాటారు. తెలంగాణ ద్రోహుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. రాస్తారోకోలు లేని రోజులు లేవు. విద్యార్థుల భారీ ర్యాలీలు తెలంగాణ ఆకాంక్షకు మరింత బలాన్ని ఇచ్చాయి. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ప్రజా గాయకుడు గద్దర్, విమలక్కతోపాటు ఎంతో మంది గాయకులు సిరిసిల్లలో ధూంధాంలు నిర్వహించారు.

తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ ఇంటర్మీడియట్ చదివే విద్యార్థి వెంకటేశం, గాయకుడు తిరుపతిరెడ్డి, కార్మికుడు శ్రీనివాస్‌తోపాటు పలువురు బలిదానం చేయడంతో ఉద్యమం ఉధృతంగా మారింది.

కలెక్టరేట్‌లో వేడుకలకు ఏర్పాట్లు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం కలెక్టర్ సందేశాన్ని ఇస్తారు. వేడుకలకు ప్రజాప్రతినిధులను, అధికారులను ఆహ్వానించారు. వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌ను విద్యుద్దీపాలతో అలంకరించారు.



విద్యుద్దీపాల వెలుగులో కలెక్టరేట్

తెలంగాణ పోరులో పిడికిలెత్తిన మహిళలు



ఆనాడు స్వాతంత్ర్య పోరులో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సిరిసిల్ల మహిళలు దిక్కార స్వరాన్ని వినిపించారు. 1935లో సిరిసిల్లలో ఆంధ్రా మహిళా సభతో మాడపాటి మాణిక్యమ్మ, ఎల్లప్రగడ సీతాదేవి వంటి వారు మహిళా ఉద్యమ స్ఫూర్తిని చాటారు. అదే స్ఫూర్తితో తెలంగాణ పోరులో సిరిసిల్ల మహిళలు పిడికెలెత్తారు. వారి ఆందోళనల ఫలితంగా పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు సాకారం కావడంతో సిరిసిల్ల మహిళలు ఆనందంతో ఉప్పొంగారు. తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను మరోసారి గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. తెలంగాణ సాధన కోసం మేమున్నామంటూ కొంగును నడుముకు చుట్టి బతుకమ్మలు, బోనాలతో అడుగులు వేశారు. సిరిసిల్లలో దాదాపు 20వేల మంది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోనే సిరిసిల్ల మహిళా శక్తిని చాటారు. రోడ్డుపై వంటావార్పులు, రిలే దీక్షలు, రాస్తారోకోలు కేవలం మహిళలు మాత్రమే నిర్వహించడం విశేషంగా చెప్పుకోవచ్చు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిలయమే కాదు పోరాటాలకు కేంద్రమని కూడా చాటి చెప్పారు. తెలంగాణ సాయుధ పోరులో తమకంటూ ప్రత్యేకతను నిలుపుకున్న సిరిసిల్ల మహిళలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిరిసిల్లను ముఖ్య భూమికగా నిలిపారు. మహిళా ప్రజా ప్రతినిధులే కాకుండా బీడీలు చుట్టే అక్కలు, నాట్లు వేసే చెల్లెల్లు కూడా రోడ్డెక్కి ఉద్యమ పోరులో ముందున్నారు. సిరిసిల్ల గాంధీచౌక్ కేంద్రంగా మహిళలు పోరాటాలు చేశారు.

భానుడి భగభగ

జిల్లాలో 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

సిరిసిల్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండ తీవ్రత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మూడు రోజులుగా జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. భానుడి భగభగలతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఉదయం 10గంటలు దాటితే రద్దీ ప్రదేశాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి.శనివారం జిల్లాలో కనిష్ఠంగా 35.3, గరిష్ఠంగా 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంభీరావుపేటలో 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వీర్నపల్లిలో 43.5, సిరిసిల్ల, ఇల్లంతకుంట 43.3, రుద్రంగి 42.8, చందుర్తి, ఎల్లారెడ్డిపేట 42.7, బోయినపల్లి 42.3, వేములవాడ 42.2, వేములవాడ రూరల్ 42.2, కోనరావుపేట 41.9, తంగళ్లపల్లి 41.6, ముస్తాబాద్‌లో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మందాడి శ్రీశైలంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



విద్యుద్దీపాల అలంకరణలో రాజన్న ఆలయం

వేములవాడ టౌన్, జూన్ 1:వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దీక్ష స్వాములు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకొని కొండగట్టు అంజన్న ఆలయానికి వెళ్లారు. శాతావాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ సురేంద్ర మోహన్ ఐఏఎస్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, ఈవో రామకృష్ణ ప్రసాదాన్ని అందజేశారు.

దశాబ్ది వేడుకలకు ముస్తాబు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాజన్న ఆలయాన్ని ఆలయాధికారులు ముస్తాబు చేశారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఆలయ గోపురాలకు మిరుమిట్లు గొలిపే తీరొక్క కలర్లతో కూడిన విద్యుత్‌దీపాలను అలంకరించడంతో ఆలయం విద్యుత్‌కాంతులతో వెలిగిపోతుంది.

సహకార సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనలు

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గం ఎన్నికలు త్వరలో నిర్వహించడానికి ఎన్నికల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ సహకార సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అథారిటీకి పంపించనున్నట్లు చెప్పారు. జిల్లాలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికలను జూన్ 6న నిర్వహించనున్నట్లు, 6177 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇదే నెలలో అన్నపూర్ణ మహిళా కన్స్యూమర్స్ స్టోర్స్, 17వ బెటాలియన్ ఉద్యోగుల పరపతి సంఘం ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 86 మత్స్య సహకార సంఘాలకు, జిల్లా సహకార ఫెడరేషన్‌కు ఎన్నికలు నిర్వహించామన్నారు. గొర్రెల పెంపకందారులు, గీత కార్మికుల సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, జూన్1 (ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసే విధంగా అధికారులకు సూచనలు చేశారు.కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి, వేణు ఉన్నారు.

బద్దెనపల్లిలో రోడ్డు ప్రమాదం

- నలుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి, జూన్ 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కల్వాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (35) కుటుంబ సభ్యులతో కలిసి మాల విరమణ కోసం కొండగట్టుకు వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం కాగా బద్దెనపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న అటో ఢీకొట్టింది. దీంతో పూజ (22), జశ్వంత్ (16), అటో డ్రైవర్ రాకేష్ 19, మధు (20) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే.. తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుతాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎస్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శ్రీ ఆంజనేయం



ఆలయ ఆవరణలో భక్తులు

- కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి
- స్వామివారిని దర్శించుకున్న లక్షన్నరకు పైగా భక్తులు
- ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 1: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజన కోటితో కొండగట్టు కిక్కిరిసింది. శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం వరకు రామ లక్ష్మణ జానకీ జై.. బోలో హనుమాన్ కీ.., రామ భక్త హనుమాన్‌కీ జై.. అనే అజన్న దీక్షాపరుల సంకీర్తనలు కొండగట్టు క్షేత్రం మార్మోగిపోయింది. దీంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. కొండపైన ఎటు చూసినా రామనామ సంకీర్తనలతో కొండంతా మార్మోగింది. లక్షలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులు, భక్తులు నృత్యాలతో శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. రామదండును తలపించేలా శుక్రవారం రాత్రి నుంచి వచ్చిన దాదాపు లక్షకు పైగా వచ్చిన అంజన్న దీక్షాపరులతో కొండంతా కిక్కిరిసిపోగా కొండగట్టు క్షేత్రం కాషాయ వర్ణాన్ని పులుముకుంది. రామనామ స్మరణలతో హోరెత్తింది. 41, 21, 11 రోజుల దీక్ష బూనిన అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని, మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన కల్యాణ కట్టలో దీక్షలు విర మించారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారి జేఎన్‌టీయూ మార్గం గుండా రామదండును తలపించేలా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజన సాగరంగా మారింది.



దీక్షాపరుల పాదయాత్ర

కిక్కిరిసిన దీక్ష విరమణ మండపం



వేలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులతో కల్యాణ కట్టలో ఏర్పాటు చేసిన దీక్ష విరమణ మంటపం కిక్కిరిసింది. మాల విరమణ ఏర్పాట్లను ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. మాల విరమణ చేసిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● ఘనంగా హనుమాన్ జయంతి

కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్న సన్నిధిలో ఉదయం మూడు గంటలకు తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణములు, విశేష అభిషేకం, తులసీ అర్చన, శ్రీ స్వామి వారికి పట్టు వస్త్రాలంకరణ, సహస్ర నాగవల్లి, అర్చన, హోమం, మహా పూర్ణాహుతితో పాటు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో త్రైయాహ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండుగ ప్రత్యేక అధికారులు రామకృష్ణ, వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో చంద్ర శేఖర్, ఆలయ స్థానాచార్యులు తిరు క్కోవెల కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్ ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● అంజన్నను దర్శించుకున్న విప్, ఎమ్మెల్యేలు

కొండగట్టులో జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి, పెద్ద పల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు అంజన్న దర్శిం చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్‌కు చెందిన పద్మశాలి సంఘ ప్రతినిధులు తయారు చేసిన పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం యాగశాలలో జరుగుతున్న త్రికుండాత్మక యాగంలో పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు



మాల విరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు



కొండపైన భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవకులు



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న హనుమాన్ దీక్షాపరులు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

- స్టడీసర్కిల్‌లో మరో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ



వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

కరీంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీఎస్సీ-2024, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కరీంనగర్, జగిత్యాలలోని తెలంగాణ ఎస్సీ స్టడీసర్కిల్‌లో డీఎస్సీ-2024, ఇతర పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మరో నెల రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా వసతి సౌకర్యం కూడా కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెద్దఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఎస్సీ-2024తోపాటు పోటీపరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం ఎస్సీ స్టడీసర్కిల్‌లో రెండు నెలల నుంచి ఇస్తున్న ఉచిత శిక్షణ మే 31తో ముగిసింది. జూలై 17 నుంచి 31వ తేదీ వరకు డీఎస్సీ-2024 నిర్వహిస్తున్నందున ఉచిత శిక్షణ గడువును పొడగించాలని విద్యార్థులు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరడంతో ఆయన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు మరో నెలరోజులపాటు ఉచితశిక్షణ, వసతి కల్పిస్తుందని లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

పాము కాటుకు చిన్నారి మృతి

పెద్దపల్లిటౌన్, జూన్ 1: పాము కాటుతో చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన నిట్టూరు వైష్ణవి (11) దాహం వేసి ఫ్రిజ్ వద్దకు వెళ్లి నీళ్లు తాగింది. కాలుకు నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎలుకలు కాటువేశాయని భావించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. పాముకాటుకు గురైందని వైద్యులు నిర్ధారించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గంమధ్యలో చిన్నారి మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ధర్మారం, జూన్ 1: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన రాంపెల్ల వినోద(54) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న తల నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ధర్మారం, జూన్ 1: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వడదెబ్బతో మృతిచెందాడు. అతడి వయస్సు 35 ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నల్లని గీతల ఫుల్ హ్యాండ్స్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎవరైన గుర్తు పట్టినట్లైతే ఈ క్రింది నంబర్లు ఎస్సై 8712656508, సీఐ 8712656505, ఏసీపీ 8712656507 సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

● గర్షకుర్తిలో వృద్ధురాలు..

గంగాధర: గంగాధర మండలం గర్షకుర్తికి చెందిన వృద్ధురాలు వడదెబ్బతో శనివారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం అన్నవ్వ(86) రేకుల షెడ్డులో ఉంటుంది. ఎండ వేడికి శుక్రవారం రాత్రి వాంతులు చేసుకుని శనివారం ఉదయం మృతి చెందింది.

నాటుసారా పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: గోదావరిఖని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. నాటుసార తరలిసున్నారనే సమాచారం మేరకు కాలనీలోని మార్కెట్ సమీపంలో కోర మాన్య అనే వ్యక్తిని తనిఖీ చేయగా, నాలుగు లీటర్ల నాటుసార లభ్యమైంది. కోరమాన్యపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్టార్ మీటింగ్‌లు

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి నేపథ్యంలో మే 1 నుంచి 31 వరకు ఒంటి పూట బడి నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ 15 రోజులు, అయా 15 రోజులు చొప్పున సెలవులను వినియోగించుకోనున్నారు. ఒకరు సెలవులో ఉన్నప్పుడు మరొకరు విధులు నిర్వహించారు. సెలవులు ముగియడంతో తిరిగి అంగన్‌వాడీ కేంద్రాలు రెండు పూటలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించంతోపాటు అంగన్‌వాడీ బడిబాట, కుటుంబ సర్వేపై సమీక్షించారు. సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహించిన సమావేశాలకు సీడీపీవో అలేఖ్య, మెడికల్ అధికారి దీప్తి సూపర్‌వైజర్ సుస్మిత, టీ హబ్ కో ఆర్డినేటర్ రోజా, దేవిక పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు విజయవంతం



సర్టిఫికెట్లు, పతకాలతో క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూన్ 1: సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తెలంగాణ సీనియర్, యూత్, కిడ్స్ రన్(మొదటి సారి)జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిసాయి. విజేతలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీల్లో హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన 30 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, బాబు, శ్రీనివాస్, సాయికృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లపై విచారణ

ముస్తాబాద్, జూన్ 1: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్ల ఘటనపై శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వడ్లకొండ అరవింద విచారణ చేపట్టారు. చిన్నారులకు కుళ్లిపోయిన కోడిగుడ్లు అందించారని చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. దీంతో పత్రికల్లో కథనాలు రావడంతో విచారణ చేశారు. వేసవి కాలం మూలంగానే ఇలా కుళ్లిపోయాయన్నారు. కోడిగుడ్లను తీసుకోవడం సైతం ఆలస్య కావడంతో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

ఎల్లారెడ్డిపేట, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఆదివారం విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులను గుర్తించి గౌరవిస్తామన్నారు. తెలంగాణ కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్వాయిపాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, సుధాకర్, రాజేందర్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు

వీర్నపల్లి, జూన్ 1 : మిషన్ భగీరథ మంచినీటి ట్యాంక్ పైపులైన్ ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ అన్నారు. వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండాలో మంచినీటి ట్యాంక్ తన పొలంలో ఉందంటూ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ట్యాంక్ చుట్టూ మట్టి తీసేసి పైపులైన్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. పైపులు ధ్వంసం చేయడంతో చుట్టుపక్కల మూడు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. పైపులు ధ్వంసం చేయడమే కాకుండా అధికారుల, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాగునీటి కోసం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పైపులన్ సరి చేస్తున్నామన్నారు.

మల్లేశం సంతాప సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 1: సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం సంతాప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సామల మల్లేశం సంతాప సభ కరపత్రాన్ని సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడారు. సోమవారం సిరిసిల్ల పట్టణం లహరి ఫంక్షన్ హాల్‌లో సీపీఐ సీనియర్ నాయకుడు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం సంతాప సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు మర్రి వెంకటస్వామి, ఐదు జిల్లాలో కార్యదర్శులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు సోమ నాగరాజు, లింగం, నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ

చందుర్తి జూన్ 1 : చందుర్తి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా పోంచెట్టి తిరుపతితోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎంపీటీసీ పులి రేణుక సత్యయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొట్టె ప్రభాకర్, నాయకులు పోతరాజు రవి, ఉలిసే గిరిప్రసాద్, మర్రి మల్లేశం, కత్తి తిరుపతి, దారం రామచంద్రం, మరి కిష్టయ్య, మక్కా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ఆది శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

ఇల్లంతకుంట, జూన్ 1: పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో శనివారం భక్తిప్రపత్తుల మధ్య కొనసాగాయి. ఇల్లంతకుంట, పొత్తూర్, కందికట్కూర్, రేపాక తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానాలు చేపట్టారు. మండలకేంద్రంలో గంగాధర ఆలయంలో షష్ఠమ వార్షికోత్సవాల్లో పలు గ్రామాల భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు మూగు నాగరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గుండారం, బొప్పాపూర్, గొల్లపల్లి, తిమ్మాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, మద్దికుంట, మోయినికుంట, గూడెం, తెర్లుమద్ది, నామాపూర్, ఆవునూర్ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హోమం, అన్నదానం, కుంకుమ పూజలు, తీర్థ ప్రసాదముల వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచ్ భాగ్య, గౌతంరావు, కళ్యాణి పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భీమేశ్వరాలయంలోని హనుమాన్ ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అగ్రహారం జోడాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆరెపల్లి, నాంపల్లి, సంకెపల్లి, తిప్పాపూర్ హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని లింగంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. లింగంపల్లిలోని ఆంజనేయస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. తాజా మాజీ సర్పంచ్ సామ కవితతిరుపతిరెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు



అభిషేకం చేస్తున్న భక్తులు

కోనరావుపేట : కోనరావుపేట మండలం కనగర్తిలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ చిత్రపటంతో భక్తులు శనివారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులు వచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

చందుర్తి :మండలంతోపాటుమల్యాలలోని హనుమాన్ ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి నిర్వహించారు. ఆలయ అర్చకులు కందాలై వెంకటరమణచారి, మురళి పూజలు నిర్వహించారు. లక్కర్సు శశికుమార్, కొత్త శ్రీకాంత్, సందీప్, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 1:వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలోని భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, నాయకులు కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



రాజన్న ఆలయ ఆవరణలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఆర్యవైశ్య సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో..

వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత హాజరయ్యారు. ఆది శ్రీనివాస్‌కు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ ఉన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల క్రైం, జూన్ 1: ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదా లత్‌ను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎన్.ప్రేమలత అన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఆమె మాట్లాడారు. ప్రజలకు న్యాయసేవలు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత న్యాయం అందిం చనున్నట్లు చెప్పారు. లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ఉన్న క్రిమినల్, అన్ని సివిల్ కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం లభిస్తుందన్నారు. భూ తగాదాలు, బ్యాంకు రుణాలు, కుటుంబ కలహాలు తదితర కేసులలో లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఇరువర్గాల్లోని కక్షిదా రుల్లో ఎవరికైనా ఆర్థిక స్థోమత లేకపోతే న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే సేవలు అందిస్తుందన్నారు. ఒకసారి లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమైతే ఆ కేసులో ఏ కోర్టుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ప్రతీ శని వారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కూడా సద్వినియోగం చేసు కోవాలన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలు



సిరిసిల్ల ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 1: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలను సంఘం జిల్లా నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవనంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్, నాయకులు తడుక కమలాకర్, ప్రసాద్, శ్రీకాంత్, తిరుపతి, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి :తంగళ్లపలి మండలం పద్మనగర్‌లోని లగిశెట్టి వృద్ధాశ్రమంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కందుకూరి రామగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. భిక్షపతి, నరేశ్, సంతోష్ రాజు తదితరులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డేకేర్ సెంటర్‌లో శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో శనివారం బీసీ ఉద్యమ రాష్ట్ర నేత పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలను నిర్వహించారు. మా అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.నాయకులు ప్రవీణ్, నరేష్ చారి, రాజు, మహేష్, రమేష్, సురేష్, రాజు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

ఎల్లారెడ్డిపేట, జూన్ 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా, పార్వతిరాజరాజేశ్వరస్వామి, అంజనేయస్వామి, హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గుండయ్యశర్మ ఆధ్వర్యంలోని పురోహితులు స్థాపిత దేవతహవనం, అభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల నడుమ పార్వతిపరమేశ్వరుల కల్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. సాయంత్రం అయ్యప్పస్వామి మహాపడి పూజను నిర్వహించారు.

కాలుతున్న హరితహారం మొక్కలు



మూడపల్లిలో కాలిపోతున్న మొక్కలు

చందుర్తి, జూన్ 1: హరితహారంలో భాగంగా గ్రామాల్లో రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు కొందరు రైతులు, బాటసారుల తప్పిదంతో కాలి పోతున్నాయి. మొక్కల చుట్టూ ముళ్లకంపలు, గడ్డి తొలగించక పోవడంతో రైతులు పొలాల్లోని చెత్తాచెదారం, ముళ్ల కంపలు తగులబెట్టే క్రమంలో, బాటసారులు వేసే నిప్పులకు మంటలు చెలరేగి మొక్కలు దగ్ధమవుతున్నాయి. రెండు రోజులుగా మూడపల్లి, మరిగడ్డ, చందుర్తి, మల్యాల గ్రామాల్లోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారికి పక్కన గడ్డికి నిప్పంటుకొని హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి. ఇలాంటి సంఘ టనలు తరచూ జరుగుతునా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని, మిగిలిన మొక్కలకైనా రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

కోనరావుపేట, జూన్ 1: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ లభిస్తుందని మండల గౌడ సంఘం అధ్యక్షుడు అబ్బసాని శంకర్ గౌడ్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శనివారం పదో తరగతిలో అత్యధిక జీపీఏలు సాధించిన గౌడ విద్యార్థినులు దీప్తి, రిత్వికకు నగదు ప్రోత్సాహాలు అందజేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గౌడ సంఘం నాయకులు తీగల రవీందర్ గౌడ్, నందగిరి తిరుపతి గౌడ్, వెంగలి వెంకన్న గౌడ్, తాళ్లపల్లి తిరుపతి గౌడ్, శ్రీకాంత్ గౌడ్, వెంగలి దేవయ్య గౌడ్, ముష్టం అంజయ్య గౌడ్, మెరుగు నందయ్య గౌడ్, జవ్వాజి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ

కోనరావుపేట, జూన్ 1 : కోనరావుపేట మండలం మర్తనపేట పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వంశీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా ఇరుమాళ్ల తిరుపతి, పాలకవర్గ సభ్యులుగా పర్శరాములు, పునీత్, శ్రీనివాస్, గౌరయ్య, మల్లయ్య, అంజయ్య, ఓరుగంటి రాజయ్య, ఎండీ ఫక్రుద్దీన్, సుల్తానా, లక్ష్మణ్, గొట్టెపర్తి పర్శరాములు ఎన్నికయ్యారు.

పశుగ్రాసం దగ్ధం.. రైతుకు స్వల్ప గాయాలు

కోనరావుపేట జూన్1: కోనరావుపేట మండలం మామిడిపల్లిలో జవ్వాజి మల్లయ్య అనే రైతు శనివారం వరికొయ్యలకు నిప్పు పెట్టాడు. దీంతో మంటలు వ్యాప్తి చెంది పక్కనే ఉన్న పశుగ్రాసం, కరెంట్ మోటారు పైపులు, ఎడ్ల బండి దగ్ధమయ్యాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా రైతుకు కూడా గాయాలయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు మల్లయ్య తెలిపాడు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముస్తాబాద్, జూన్ 1:ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మద్దికుంట వైపు ద్విచక్రవాహనం వైపు వెళ్తుండగా ఎదురుగా మరో వాహనం రావడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ముస్తాబాద్‌కు చెందిన కరికె నాంపెల్లి మద్దికుంట వైపు వెళ్తున్నాడు. మద్దికుంట వైపు నుంచి వెంకటేశ్ ము స్తాబాద్ వైపు వస్తున్నాడు. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

కోనరావుపేట, జూన్ 6:కోనరావుపేట మండలం మంగళ్లపెల్లిలో ఓ వృద్ధుడు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మంగళ్లపెల్లికి చెందిన ఆది ఆశయ్య(60), అతడి భార్య, కొడుకు కుటుంబంతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఆశయ్య, అతడి భార్య గదిలో నిద్రించారు. ఉదయం లేచి చూసే సరికి ఆశయ్య మృతి చెంది ఉన్నాడు. వృద్ధుడి మృతిపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేయడంతో విషయం తెలుసుకున్న ఎస్సై అంజనేయులు మంగళ్లపల్లికి చేరుకున్నారు. మృత దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం చేయాలని అంత్యక్రియలను ఆపారు. పోస్టుమార్టంలో ఎలా చనిపోయాడో తెలుస్తుందని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి..

తంగళ్లపల్లి, జూన్1: తంగళ్లపల్లి మండలం మండపల్లికి చెందిన గీత కార్మికుడు పెద్ది మల్లేశం అలియాస్ చిరంజీవి (54) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వారం రోజుల క్రితం తంగళ్లపల్లి నుంచి మండపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదుపుతప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మల్లేశంను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

వేములవాడ టౌన్, జూన్ 1 : వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులో శనివారం ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి బైపాస్ రోడ్డులో ఆటో, కారు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో పల్టీలు కొట్టింది. దీంతో అందులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

కార్యవర్గాల ఎన్నిక

రుద్రంగి జూన్ 1: రుద్రంగి మండల కేంద్రంలోని తూర్పువాడ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా బైరెడ్డి కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆకుల భూంరెడ్డి, కోశాధికారిగా కోల కిషన్, సభ్యులుగా కోల లచ్చిరెడ్డి, నారాయణ ఎన్నికయ్యారు. ఆకుల గంగారాం, పిప్పరి మోహన్, పుప్పాల భాస్కర్, బింగిశెట్టి వెంకటేష్, ఎంగల మల్లేశం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని అంబేద్కర్ చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందె బాబు, ఉపాధ్యక్షుడిగా అందె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా దాసరి సతీష్, కోశాధికారిగా అందె సుదర్శన్, కార్యవర్గ సభ్యుడిగా అందె బాల నర్సు ఎన్నికయ్యారు. సామాజిక కార్యక్రమాలతోపాటు సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు సింగారంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిర్యాల్‌కార్ పద్మ, రొడ్డ రాములు, కొడిమోజు పోచయ్య కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి శనివారం వేర్వేరుగా పరామర్శించారు. నాయకులు పర్శరాములు, నర్సింలు, లక్ష్మణ్, శివరామకృష్ణ, సందీప్ ఉన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరి రిమాండ్

చందుర్తి, జూన్ 1: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఒకరిని రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఏప్రిల్ 30న మర్రిగడ్డలో కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డు శ్రీనివాసులు పెట్రోలింగ్‌లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కత్తి చంద్రయ్య పోలీసుల ట్యాబ్ తీసుకొని విధులకు ఆటంకం కలిగించాడు. ఈ మేరకు అరెస్టు చేసినట్లు తెలిపారు.

జీతాలు చెల్లించాలి

గంభీరావుపేట, జూన్ 1: గంభీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని సమ్మెబాట పట్టారు. తమకు రావాల్సిన ఆరు నెలల జీతాలు ఇవ్వాలని శనివారం గ్రామపంచాయతీ ఈవో అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కుటుంబ పోషణ కష్టతరమైందని తినడానికి తిండి లేక ఉపవాసం ఉంటున్నామని అయినా గ్రామపంచాయతీ అధికారులు, మరియు ఎంపీడీవో కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి తమకు జీతాలు ఇవ్వాలని కోరారు. ఎంపీటీసీ కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు, గ్రామపంచాయతీలోకి ఈవోపీఆర్‌డీ రాజశేఖర్ వచ్చి కార్మికులతో దూరుసుగా ప్రవర్తించారని కార్మికు లు తెలిపారు. భిక్షపతి, టేకుమల్ల రవి, ఎర్రోళ్ల సకులవ్వ, ఎల్లంగారి లక్ష్మి, రాగబోసు లక్ష్మి, గాదం ఇందిరా, ఇరిగి లక్ష్మి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 1: నకిలీ విత్తనాలు విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్, పాతబస్టాండ్‌లో సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రశీదులు, విత్తన సంచులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు. గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. నకిలీ విత్తన వ్యాపారుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు చెప్పారు. నకిలీ విత్తనాలు కలిగి ఉన్న, అమ్మిన వ్యక్తులపై పీడీ యాక్ట్ అమలు చేసి జైలుకు పంపిస్తామన్నారు. రాబోయే నెల రోజులు కీలకమని, జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో మోసం పోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులపై ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్స్ షాప్‌లపై నిఘా ఉంచి నకిలీ విత్తనాల విక్రయాలను అరికడుతున్నట్లు చెప్పారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటపుడు తప్పకుండా రశీదులు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులపై సమాచారం ఉంటే డయల్ 100 సమాచారం అందించాలన్నారు. ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ రఘుపతి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రైతులకు నాసిరకమైన విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణంలో ఎరువులు ఎన్ని ఉన్నాయో ప్రదర్శించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మితే లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామన్నారు. వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఎస్సై రాజుగౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్, ఏఈవో శ్రీధర్ రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని అన్ని ఫర్టిలైజర్ షాపులలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట : రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్ తదితర గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని విత్తనాల నిల్వ, ఎరువులు, రికార్డులను పరిశీలించారు. విత్తనాల క్రయ, విక్రయ వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతులకు తప్పకుండా రశీదును అందించాలన్నారు. ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాల ఎంపికపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.

కోనరావుపేట: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో శనివారం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొన్నవారికి రసీదులు ఇవ్వాలని సూచించారు. రసీదు పొందిన రైతులు భద్రపరుచుకోవా లన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే సమాచారం అందించాలని ఫర్టిలైజర్ యజమానులకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు అవుతాయన్నారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

● రైతులు విత్తనాలు కొనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోనరావుపేట వ్యవసాయ అధికారి వెంకటరామమ్మ అన్నారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు డీలర్ల వద్దనే కొని రసీదును పొందాలన్నారు. పంటలు పండే వరకు రసీదును కాపాడుకోవాలన్నారు. లూజుగా ఉన్న విత్తనాల పాకెట్‌ను కొనుగోలు చేయవద్దని, పాకెట్లపైన తయారు చేసిన తేదీ ముగింపు తేదీ చూసి కొనుగోలు చేయాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్